శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెసి రాంసుందర్‌రెడ్డి

పోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

- రిటర్నింగ్ అధికారి రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మాన్యువల్‌ను చదివి క్షుణ్ణంగా అర్థంచేసుకొని విధులను విజయవంతంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని చాణిక్యపురి కాలనీలోని ఉద్యాన భవన్ నందు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పిఒలకు, ఎపిఒలకు, జరిగిన ఎన్నికల శిక్షణా కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి , సంయుక్త కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎఆర్ఒ , డిఆర్ఒ నాగేశ్వరరావు,ఉమ్మడి జిల్లాలోని రెవెన్యూ డివిజన్ల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం వారి ఎన్నికల నియమావళి పై రూపొందించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని పూర్తి అవగాహనను ఏర్పరుచుకోవాలన్నారు. పిఒలు, ఎపిఒలు పొరపాట్లకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్‌కు సంబంధించిన పోలింగ్ మెటీరియల్ మొదలుకొని బ్యాలెట్ బాక్సులు సీల్ చేసేంతవరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల పోలింగ్ మార్చి 13న జరగనున్నాయని పోలింగ్ ఉదయం 8 నుండి సాయంత్రం 4 వరకు ఉంటుందని పిఒలు, ఎపిఒలు ఎన్నికల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పోలింగ్ నిర్వహణపై అవగాహన కోసం ఈ శిక్షణా తరగతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం ఎనిమిది గంటలకు మొదలు అయినప్పటి నుండి సాయంకాలం బ్యాలెట్ బాక్సులు సీల్ అయ్యేంతవరకు నిరంతరంగా వీడియో కవరేజ్ చేస్తారన్నారు. ఎన్నికల ప్రారంభ సమయంలో పోలింగ్ బూత్‌లోకి వచ్చే పోలింగ్ ఏజెంట్లు ఫారం 10 తో రావాలని ఏజెంట్లు ఒక్కసారి లోనికి వచ్చిన తర్వాత మరలా బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. పోలింగ్ బూత్ లోనికి ఓటు హక్కు కలిగిన ఓటర్లు, ఎన్నికల పరిశీలకులను, పోటీలో ఉన్న అభ్యర్థి, ఎన్నికల అథారిటీ లెటర్ కలిగిన వారు మాత్రమే బూతుల లోనికి రావచ్చన్నారు. ఎన్నికల బూతులోకి సెల్ ఫోన్లు కానీ పెన్నులను కానీ అనుమతించరాదన్నారు. రిటైర్డ్ డిప్యూటి ఎస్ఒ మాస్టర్ ట్రైనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తూ, బ్యాలెట్ పేపర్లను ఎలా వినియోగించాలి, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను ఏజెంట్లకు చూయించి ప్రొసీడింగ్ ఆఫీసర్స్ ఏజెంట్లు సంతకాలు చేసిన పేపర్స్‌తో సీల్ చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం కూడా ఏజెంట్ల సమక్షంలోనే సీల్ చేసి సంతకాలు తీసుకొని రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్స్‌లను చేర్చాలన్నారు. అదే విధంగా పిఒ డైరీ , ఇతర ప్రొఫార్మాలను అందజేయాలన్నారు. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల రెవెన్యూ డివిజన్ల అధికారులు, ఎన్నికల విధులకు హాజరయ్యే పిఒలు, ఎపిఒలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

మండే ఎండ...

- మొదలైన భానుడి భగభగలు
- గతేడాది కంటే 3 డిగ్రీలు అధికం

కర్నూలు రాజ్‌విహార్ కూడలిలో ఎండలో నిలిచి ఉన్న వాహనదారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి మొదటి వారంలోనే భానుడి భగభగలు మొదలయ్యాయి. గతేడాదితో పోలిస్తే 3 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

మార్చి మొదటి వారంలోనే భానుడు భగభగలాగుతున్నాడు. జిల్లాలో వేసవి తీవ్రత ఆరంభమైంది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సోమవారం కర్నూలు నగరంలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయంలో 36 డిగ్రీలు, ఆలూరులో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది ఇదే సమయానికి అత్యధికంగా 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 3 డిగ్రీల మేర పెరిగింది. మార్చి తొలి వారంలోనే ఇంత తీవ్రంగా ఎండలు కాస్తుంటే రాబోయే రోజుల్లో ముఖ్యంగా ఉగాది నుంచి మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

జాడలేని చలువ పందిళ్లు

ఎండ వేడిమి నుంచి వాహనదారులు ఉపశమనం పొందేందుకు కర్నూలు నగరంలో గతంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. గతేడాది కూడా భానుడు ఉగ్రరూపం దాల్చిన తరువాత నగరంలోని రాజ్ విహార్ కూడలి, సి.క్యాంప్, బళ్లారి చౌరస్తా, కలెక్టర్ కార్యాలయం వంటి ట్రాఫిక్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో, ప్రయాణికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఆ రకమైన చర్యలేమి చేపట్టలేదు. ఎండ వేడిమి ప్రారంభమైన నేపథ్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు.

చీలిన ఇండ్లను పరిశీలిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

రాతనలో చీలిన ఇండ్లు

భూకంపం అంటూ భయపడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం రాతన గ్రామంలో సోమవారం ఉదయం భూకంపం వచ్చి 10 ఇండ్లు సిమెంట్ రోడ్డు చీలిపోయినట్లు రాతన గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి రాతన గ్రామానికి చేరుకొని చీలిపోయిన ఇండ్లను, రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆమె బాధ్యతలతో మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుండి ఏమైనా ఆర్థిక సహాయం వచ్చే విధంగా చూస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ రవి, జడ్‌పిటిసి పులికొండ నాయక్, కో ఆప్షన్ సభ్యులు చాంద్ బాషా, స్థానిక నాయకులు ఆర్‌వి మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు తుగ్గలి మోహన్ రెడ్డి, జిట్టా నగేష్, అట్లా గోపాల్ రెడ్డి, గిరిగట్ల విష్ణువర్ధన్ రెడ్డి , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, సర్వేయర్ గాది లింగప్ప, విఆర్ఒ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి నిలువెత్తు రూపం సోమన్న

- ప్రథమ వర్ధంతి సభలో ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మానవత్వానికి నిలువెత్తు రూపం సోమన్న అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో సోమన్న ప్రథమ వర్ధంతి సభ కర్నూలు మండలం పార్టీ కార్యదర్శి పిబి. ఉశేనయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సోమన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్ధంతి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ. గఫూర్ మాట్లాడుతూ సోమన్న మానవత్వానికి నిలువెత్తు రూపం అని, నీతి, నియమ, నిబద్ధతో పార్టీలో పని చేశారన్నారు. పార్టీ ఏ పని అప్పజెప్పినా ఆ పనికి ఎలాంటి ఆటంకాలు కలిగినా దాన్ని పట్టుదలతో పూర్తి చేసేవారన్నారు. పార్టీ అనేక ప్రాంతాలకు వెళ్లి పని చేయాలని సూచన చేస్తే దాన్ని తప్పకుండా అమలు చేసే గొప్ప లక్షణం కలిగిన నాయకుడన్నారు. పార్టీ కోడుమూరు డివిజన్ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యునిగా కర్నూలు మండల కార్యదర్శిగా ప్రజలకు ఎంతో సేవలు చేశారని కొనియాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సోమన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమైనదని, జీవితం చివరి దశలో కూడా పార్టీ ఇచ్చిన పిలుపుల కోసం పనిచేశాడన్నారు. ప్రజాసంఘాల నిర్మాణం కోసం ఆయన పడ్డ తపన మనకు దారి చూపే లక్షణం అన్నారు. అనంతరం సోమన్న కుటుంబానికి రూ.రెండు లక్షల 50వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శిడి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఆయన పార్టీ కోసం చేసిన సేవలను కొనియాడారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. పంచలింగాల సర్పంచి సతీమణి భర్త కృష్ణ వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు, కెవి నారాయణ, సిపిఎం మండల

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

నాయకులు ఆంజనేయులు, సోమన్న సతీమణి నాగలక్ష్మి, తల్లి గంగమ్మ, తమ్ముడు మద్దిలేటి, కుమార్తె రిషిత పార్టీ కర్నూలు మండల కమిటీ సభ్యులు బీసన్న, రాఘవేంద్ర, వెంకటేశ్వర్లు పార్టీ కార్యకర్తలు, సోమన్న అభిమానులు పాల్గొన్నారు. ఈ వర్ధంతి సభ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడుతూ ప్రజానాట్యమండలి కళాకారులు జిబి మద్దిలేటి లోకేష్ సుబ్బరాయుడు సుంకన్న బతకన్నా గేయాలపన చేశారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

సోమన్న స్మారక గ్రంథాలయం ప్రారంభం

కర్నూలు క్రైమ్ : కీర్తిశేషులు సిపిఎం నాయకులు సోమన్న స్మారక గ్రంథాలయాన్ని సోమవారం కర్నూలు మండలం గొందిపొర్ల గ్రామంలో ప్రారంభించారు. సిపిఎం నాయకులు సోమన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా గొందిపర్ల గ్రామంలో ప్రథమ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సభకు సిపిఎం మండల కమిటీ సభ్యులు ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, కర్నూలు మండలం ఎంపిపి వెంకటేశ్వరమ్మ వాసు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ హాజరయ్యారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోమన్న స్మారక గ్రంథాలయాన్ని వారు ప్రారంభించారు. ఇ.తాంద్రపాడు సర్పంచు బాలపీర, పంచలింగాల సర్పంచి సతీమణి భర్త జి.కృష్ణ, గొందిపర్ల సర్పంచి బి.శ్రీనివాసులు, ఉల్చాల సర్పంచి విద్యాసాగర్, గొందిపర్ల ఎంపిటిసి కృష్ణవేణి గోపాల్, సిపిఎం మండల కార్యదర్శి పిబి హుస్సేనయ్య, ఎంఎస్.బాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపిపి వెంకటేశ్వరమ్మ

నగదు ప్రోత్సాహంతో అభినందిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, సిఇఒ రమణ

జాతీయ ఆర్చరీకి సాయి గీతిక

డాక్టర్ శంకర్‌శర్మ, సిఇఒ రమణ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

ఈనెల తొమ్మిది నుంచి గుజరాత్ లోని ఎక్తానగర లో జరగనున్న జాతీయ ఆర్చరీ పోటీలకు కర్నూలుకు చెందిన సాయి గీతిక ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం కర్నూలు స్టేడియంలో సాయి గీతికను ప్రముఖగ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ రమణ కలసి సత్కరించారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సాయి గీతిక మంచి ప్రతిభ కనబరిచి రాణించాలన్నారు. అనంతరం సాయి గీతికకు రూ.ఐదు వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నారత్నమయ్య, వంశీకృష్ణ, రాజు, సీనియర్ క్రీడాకారులు బాలాజీ రెడ్డి, తేజస్విని తదితరులు,పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

యనగండ్లలో పొలంబడి పై అవగాహన

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని పోలకల్ గ్రామంలో ఎఒ మల్లేష్ కుమార్ సోమవారం పొలంబడిపై అవగాహన కల్పించారు. రైతు భాస్కర్ వేరు శనగ పొలంలో రైతులతో సమీక్షించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడినిచ్చే దిగుబడిని ఎలా పొందాలో తెలిపారు. రైతులకు స్వయం సాధికారత కీలకమని అధికారుల సలహాలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎంపిఇఒ వెంకటేశ్వర్లు, రాధిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు హైవే రోడ్డు కొరకు భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరలకు అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ డిమాండ్ చేశారు. కనీసం ఎకరాకు రూ.50 లక్షలు తక్కువ కాకుండా ఇవ్వాలన్నారు. సోమవారం నూతనపల్లె గ్రామంలో భూములు కోల్పోయిన రైతులు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి డిఆర్ఒ ఆఫీస్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం సమర్పించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు నగరానికి కూత వేటు దూరంలో ఉన్న నూతనపల్లి భూములు అత్యంత విలువైనవని హంద్రీనీవా గ్రామం పక్కల పోవడం వలన భూములందరికి వచ్చి రెండు కార్లు మూడు కార్లు పంటలు ఉండేటువంటి భూములు ఉన్నాయన్నారు. వీటి విలువ సుమారు ఒక ఎకరం రూ.కోటి పలుకుతుందన్నారు. అటువంటి భూములను కేవలం రూ.12 లక్షలు ధర నిర్ణయించడం అంటే రైతుల గొంతు కోయడం తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికే రైతులు అనేక రకాలుగా నష్టపోయి ధరలు లేక పెట్టుబడి ఖర్చులు పెరిగి తీవ్రమైన ఆందోళనలతో ఉన్నారన్నారు. పైపెచ్చు ఇటువంటి రోడ్ల కోసం భూములు సేకరించి బలవంతంగా తక్కువ ధరచెల్లించి తీసుకుంటామని ఆదేశాలు జారీ చేయడం రైతులను మరింత దిగ్భ్రాంతికి గురి చేస్తుందన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న రైతులు

జగనన్న ఇళ్ల నివాసం కోసం ప్రభుత్వమే ప్రభుత్వ భూమిని ఎకరా ఒక ఇంటికి రూ.18 లక్షల ప్రకారం కొనుగోలు చేశారని, వాటి ప్రకారమైన 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మూడంతలైతే ఒక ఎకరా రూ.56 లక్షలు అవుతుందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు రైతుల పట్ల సానుభూతితో ఆలోచన చేసి సరైన ధర న్యాయమైన నష్టపరిహారం చెల్లించి భూములు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో భూములను బలవంతంగా తీసుకుంటే ప్రతిఘటిస్తామని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు శేఖర్ వీరేష్, రాముడు, కె. నాగేంద్ర, రామాంజనేయులు, మద్దిలేటి, మచ్చంద్ర, కాజముద్దీన్, నీలకంఠం లక్ష్మీదేవి, నాగమద్దయ్య, టి రాజశేఖర్ మాబాష లు పాల్గొన్నారు.

హోళగుంద ఎస్ఐని సస్పెండ్ చేయాలి

దళిత ప్రజా సంఘాలు డిమాండ్- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

హోళగుంద మండలం, హెబ్బటం గ్రామంలో దళితుడైన వెంకటేష్‌ను చెట్టుకు కట్టేసి, నాలుగు గంటలు నిర్బంధించి విచక్షణ రహితంగా కొట్టిన శివప్ప, చౌరప్ప, వెంకటేష్, మల్లికార్జున, తాయమ్మ, రామన్న, ఉసేనిలపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హోలగుంద ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని సోమవారం హెబ్బటం ఘటన పై ఎస్‌పి ప్రత్యక్ష జోక్యం చేసుకోవాలని కోరుతూ కర్నూలు జిల్లా కలెక్టరేట్ ముందు దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాల మహానాడు ఉపాధ్యక్షులు వెంకట్ రాముడు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జి మహానంది, కాంగ్రెస్ నాయకులు దామోదరం రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. దళిత వెంకటేష్ వేసుకున్న మిరప పంటను దొంగతనం చేయడంతో పాటు, తమ బండారాన్ని బయటపెడతాడని బావించి తిరిగి వెంకటేష్‌నే అక్రమంగా చెట్టుకు కట్టేసి సాయంత్రం మూడు గంటల నుండి 6 గంటల వరకు నిర్బంధించారన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. దాడికి గురైన వెంకటేష్ ఆదోని ఏరియా హాస్పిటల్ లో అడ్మిట్ అయి చికిత్స పొందుతుండగా ఎస్ఐ పరిశీలించి వెళ్లినప్పటికీ నిందితులపై కేసు నమోదు చేయ లేదన్నారు. బాధితుడి పైనే కేసు నమోదు చేయడం ఎస్ఐ పైసాచికత్వానికి నిదర్శనమన్నారు. హోళగుంద ఎస్ఐ అబ్దుల్ జహీర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో పోలీసులు నిందితుల కాసులకు కక్రుత్తిపడి దాడికి గురైన బాదితులపైనే అక్రమంగా కేసులు కడుతూ భయాందోళన సృష్టిస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు జిల్లా ఉన్నతాధికారులే పర్యటించి బాధితులకు అండగా నిలవాలన్నారు. శివప్ప, చౌరప్ప, వెంకటేష్, మల్లిఖార్జున, తాయమ్మ, రామన్న, ఉసేనిలను వెంటనే అరెస్ట్ చేయించాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఎఒ వెంకటేష్‌కు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. ధర్నా కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయమ్మ, మాజీ నగర కార్యదర్శి ఆర్ఎ అన్నయ్య, హెబ్బటం గ్రామస్తులు నాగరాజు, శకుంతలమ్మ, గోపాల్, రంగమ్మతో పాటు మరో వందమంది పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న ప్రారంభిస్తున్న డాక్టర్ ఖాదర్ వలి

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మిల్లెట్ మాన్ పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో చిరు ధాన్యాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఖాదర్ వలీ, వ్యవసాయ శాఖ జెడి వరలక్ష్మి, స్కందర్షి గ్రూపు అధినేత సురేష్ రెడ్డి నిర్వాహకులు మోహన్ శేఖర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్ వల్లి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం చిరిధాన్యాల సాగుకుగాను అనేక ప్రోత్సాహకాలు బడ్జెట్‌లో ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందన్నారు. చిరి ధాన్యాలను నిత్యం ఆహారంలో తీసుకోవడం ద్వారా అనేక పోషక విలువలు పొందవచ్చని అన్నారు. అలాగే ఆరోగ్యం కూడా సంపూర్ణంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవళి తమ జీవన విధానంలో కూడా మార్పులు చేసుకోవాలని ఆయన కోరారు... అనంతరం వ్యవసాయ శాఖ జేడి మాట్లాడుతూ జిల్లాలో రైతాంగానికి సిరి ధాన్యాల పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

129వ వార్డు సచివాలయ విఆర్ఒ సస్పెండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : నగర పాలక సంస్థ పరిధిలోని 129వ వార్డు సచివాలయంలోని విఆర్ఒ నూరోత్తమరెడ్డిని. సస్పెండ్ చేయాలని కమిషనర్ ఎ.భార్గవతేజ అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం అదే సచివాలయంలో ఎఎన్ఎంగా పని చేస్తున్న కళ్యాణి తన పట్ల విఆర్ అసభ్యకరంగా ప్రవర్తించారని, మద్యం సేవించి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను ఇష్టానుసారంగా మాట్లాడినట్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా విఆర్ఒ మాట్లాడిన ఫోన్ రికార్డును కమిషనర్‌కు వినిపించారు. ఈ క్రమంలో విధులపట్ల నిర్లక్ష్యం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినందుకు తక్షణమే సస్పెండ్ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

మెరుగైన విద్యాబోధన అందించాలి

కర్నూలు కలెక్టరేట్ : విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని వైస్ ఛాన్సర్ ఆనందరావు పేర్కొన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఆర్ట్స్ , సైన్సు గ్రూప్ కళాశాలల తరగతులను వైస్ ఛాన్సర్ పరిశీలించారు. వైస్ ఛాన్సర్ విద్యార్థులను పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా విద్యాభ్యాసం చేయాలన్నారు.

పెట్టుబడుల వెల్లువతో
యువతకు ఉపాధి అవకాశాలు
- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

కేక్ కట్ చేస్తున్న ప్రదీప్‌రెడ్డి

రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడుల వెల్లువతో యువతకు ఉపాధి అవకాశాలు వచ్చాయని వైసిపి రాష్ట్ర యువనేత నేత వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక దుర్గా రమణ కల్యాణ మండపంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడి, 378 కీలక ఒప్పందాలు, 6 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయని తెలిపారు. చంద్రబాబు మాదిరిగా విచ్చలవిడిగా ఖర్చులు చేయకుండా పెట్టుబడి పెట్టే వారే నేరుగా వచ్చే విధంగా సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

సీనియర్ జర్నలిస్టుకు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

విజయేంద్రనాథ్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న సభ్యులు

సీనియర్ జర్నలిస్టు విజయేంద్ర నాథ్ ప్రసాద్‌ను ఆదోని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఆదోని రీడింగ్ రూమ్ ప్రాంగణంలోని టెన్నిస్ కోర్టులో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త రాచోటి సుధాకరయ్య మాట్లాడారు. ఇంజినీరింగ్ కుటుంబానికి చెందిన ప్రసాద్, సివిల్ ఇంజినీర్‌గా ప్రసాద్ ప్లానర్స్ పేరుతో అనేక నిర్మాణాలకు ఆర్కిటెక్ట్‌గా పని చేశారని తెలిపారు. ఈ వృత్తితో పాటు ప్రవృత్తిగా జర్నలిజాన్ని ఎంచుకొని 38 ఏళ్లుగా కొనసాగారని చెప్పారు. తెలుగు దినపత్రిక రంగంలో పార్ట్ టైం జర్నలిస్టుగా అందరి మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడుతూ... రెండు విభిన్న రంగాల్లో తనదైన శైలితో రాణిస్తున్న ప్రసాద్ విజయ పరంపరను కొనసాగించాలని కాంక్షించారు. అసోసియేషన్ కార్యదర్శి మిరియాల భద్రినాథ్, ఇంటర్నేషనల్ ఒలింపిక్స్‌కు ఎంపికైన క్రీడాకారులు శ్వేత రెడ్డి, సీమా ఎలిగే, పి.జయలక్ష్మి, కె.భాస్కర్, శంకర్ రెడ్డి, ఖాజా బందె నవాజ్ ఆయనను అభినందించారు.

మసీదు ఎన్నికల నిర్వహణకు వ్యతిరేకం కాదు
- మసీదు ప్రధాన ట్రస్టీ సాదీ రావుఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని షాహి జామియా పెద్ద మసీదు ఎన్నికల నిర్వహణకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని, వక్ఫ్ బోర్డు అధికారులు ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించవచ్చని మసీదు ప్రధాన ట్రస్టీ, ప్రముఖ వ్యాపారవేత్త సాదీ రావుఫ్, ట్రస్టీ షాషు సాబ్ తెలిపారు. సోమవారం మసీదు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మసీదు డబ్బులు వాడుకోవాల్సిన అవసరం తనకు లేదని, తాను ఆర్థికంగా బాగానే ఉన్నానని తెలిపారు. తానే ఎన్నో దానధర్మాలు చేస్తున్నానని చెప్పారు. ప్రతి నెలా దుకాణాల బాడుగల వల్ల రూ.3 లక్షల ఆదాయం ఉంటే రూ.2.5 లక్షలు ఖర్చు ఉందని తెలిపారు. గతంలో మసీదులో పనిచేసే వారికి రూ.3 వేలు జీతం ఉంటే తాము వచ్చిన తర్వాత రూ.8 వేలు ఇస్తున్నామని చెప్పారు. అలాగే కొత్తగా ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ప్రారంభించి వారికి సైతం జీతాలు రూ.2 వేల నుంచి రూ.6 వేలు పెంచి ఇస్తున్నామని అన్నారు. అలాగే మసీదులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రతి నెలా ఆదాయం, ఖర్చు వివరాలు మసీదు బోర్డుపై వివరిస్తున్నామని చెప్పారు. ఎవరికైనా అవసరమైతే మసీదు కార్యాలయంలో వచ్చి తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న సాదీ రావుఫ్

సమస్యలపై పోరాడే వారిని గెలిపించండి

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే వారిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు కె.మద్దిలేటిశెట్టి, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యు.కారుమంచి కోరారు. సోమవారం మండలంలోని నల్లచెలిమల, గుండ్లకొండ, ఎంకె.కొట్టాల, తువ్వదొడ్డి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నిరుద్యోగులను, ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ప్రచారం చేపట్టారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోరాట పటిమ కలిగిన నాయకులని, ప్రజా సమస్యల పరిష్కారంలో, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పన కోసం జరిగే ఉద్యమంలో నిరంతర పోరు చేస్తారని తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు ఎం.నరసరావు, బజారి, భూపేష్, నరసింహులు, రంగన్న, నాగరాజు పాల్గొన్నారు.

దేవనకొండలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పెద్దకడబూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పెద్దకడబూరు : పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు ఖాయమని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కంబదహాల్, కొత్త గొల్లలదొడ్డి, హనుమాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రామన్న, వ్యకాస జిల్లా నాయకులు ఈ.తిక్కన్న మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని కోరారు. నిత్యం ప్రజా, కార్మిక, ఉద్యోగులు, రైతుల తరపున మాట్లాడేందుకు పిడిఎఫ్ అభ్యర్థులను నిలబెట్టిందని తెలిపారు. రోజురోజుకూ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని చెప్పారు. నిరుద్యోగం వంటి సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రశ్నించే గొంతులను శాసనమండలికి పంపించాలని కోరారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు.

ఆదోని : ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, ప్రజా సమస్యలను చట్టసభల్లో పరిష్కార దిశగా ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు వీరేష్, మోహన్, జమీర్ కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టణంలోని ఆర్‌టిసి కాలనీ, ఎల్ఐసి కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో పట్టభద్రులు గమనించి ఓటు వేయాలని కోరారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిఐటియు, డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు లక్ష్మణ్, తిప్పన్న గోపాల్, శ్రీనివాస్‌లు ప్రచారం నిర్వహించారు.

హోళగుంద : ప్రశ్నించే గొంతుకలను గెలిపించి, శాసనమండలికి పంపిద్దామని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని హెబ్బటం, పెద్దగోనెహాళ్, ఎమ్‌డి.హళ్లి, ఇంగళదహాల్, వందవాగిలి, గజ్జహల్లిలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లో ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నాయకులు మారెప్ప, మునిస్వామి, శ్రీరంగ, సతీష్ కుమార్ మాట్లాడారు. ఉద్యమ నేపథ్యం కలిగిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కౌతాళం : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. కౌతాళంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సమస్యలతో పాటు విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడే వ్యక్తిని ఎన్నుకోవాలని కోరారు. రైతు సంఘం మండల కన్వీనర్ ఈరన్న, నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు వలీ, వీరేష్ పాల్గొన్నారు.

ఆదోనిలో

హోళగుందలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

జాతీయ స్థాయి పోటీలకు గుండ్లకొండ విద్యార్థి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని గుండ్లకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కార్తీక్ అండర్-14 జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఉచ్చీరప్ప సోమవారం తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచినందున ఎస్‌జిఎఫ్ కమిటీ ఆ విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసిందన్నారు. ఈ సందర్భంగా అభినంద సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ రంగస్వామి హాజరయి మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. పిఇటి హరికృష్ణ, ఉపాధ్యాయులు శంషాద్ బేగం, సలీం బాష, భువనేశ్వరి, దస్తగిరి, శ్రీనివాసులు, ఉస్మాన్ అరుణ్‌లు విద్యార్థిని అభినందించారు.

రాయితీ యూనిట్లతో అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందించే పండ్ల తోటల పెంపకం, ఆవులు, మేకలు, కోళ్ల యూనిట్లను రైతులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, పశు సంవర్ధక శాఖ జెడి రామచంద్రయ్య, డిడిఎ వెంకటేశ్వర రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో జాతీయ వర్షాధార ప్రాంత పథకంపై రైతులతో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్ఆర్ఆర్ఎ పథకం ద్వారా 50 శాతం రాయితీతో గ్రామంలోని రైతులకు ఆవులు 8 యూనిట్లు, మేకలు 22 యూనిట్లు, కోళ్ల 28 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఒక రైతుకు యూనిట్ కింద 2 ఆవులు, 10 మేకలు, 28 కోళ్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. నాణ్యమైన ఆవులు, మేకలు, కోళ్లను ఎంపిక చేసుకోవాలన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 50 శాతం రాయితీతో చీని, మామిడి, దానిమ్మ మొక్కలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎడిఎలు విజయ్ మోహన్ కుమార్, సురేష్, ఎఒ సురేష్ బాబు, ఎఒ చంద్రశేఖర్, సర్పంచి చెన్నమ నాయుడు, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, ఎఇఒలు యోగేంద్ర, రంగన్న, జయరామ్, బిఎఎస్ శివలింగ, రంగన్న, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

సాగునీటి ప్రాజెక్టులకు
నిధులు విడుదల చేయాలి

- ప్రచార పాదయాత్రను జయప్రదం చేయండి
- ఆర్‌సిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ప్రకటించి, నిధులు విడుదల చేయాలని రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ, కలిసి వచ్చే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే ప్రాజెక్టుల సాధన ప్రచార పాదయాత్ర జయప్రదం చేయాలని కోరారు. సోమవారం స్థానిక ఆర్‌సిసి కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం కరువు, వలసలతో వెనుకబడిన రాయలసీమలో నేటికీ సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కరువు నివారణ కోసం ప్రతిపాదించిన, నిర్మించ తలపెట్టిన, నిధుల్లేక ఆగిపోయిన ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, నిధులు విడుదల చేయాలని కోరారు. ఈనెల 20న మండలంలోని పెద్దహరివాణం నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రచార యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 27న సి.బెళగల్ మండలం సంగాల నుంచి సి.బెళగల్ తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రాజెక్టుల సాధన ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పాదయాత్రకు మద్దతుగా ఎఐడిఎ కన్వీనర్ ఆదినారాయణ, పిఒడబ్ల్యు స్త్రీవిముక్తి రాష్ట్ర అధ్యక్షులు సుజ్ఞానమ్మ, గంగన్న, ఆర్‌సిసి రాష్ట్ర నాయకులు రవి వర్మ, అనిల్, మహేష్, రైతు కూలీ సంఘం నాయకులు సుభాష్, పిఒడబ్ల్యు స్త్రీ విముక్తి నాయకులు కళావతి పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE: KURNOOL AT ADONI.
I.A.NO. 110/2022 IN A.S.NO. 58/2011.
Between:
K.Jaffar Rahim and others. ...Petitioners.
Versus.
B.Venkata Subba Reddy and others. ...Respondent.
To,
The Respondents No.
8.S.Anjaneyulu S/o.Late Narayana Swamy, Hindu, aged about 59 years, resident of Door No.1-541-123, Raghavendra Nagar, Adoni Town, Kurnool District.
9.S.Krishna S/o.Late Narayana Swamy, Hindu, aged about 56 years, resident of Door No.1-541-123, Raghavendra Nagar, Adoni Town, Kurnool District.
Whereas the above named petitioners have filed this application requesting the Hon'ble Court to add you as respondents No.7 and 8 in the appeal A.S.No.58/2011 being the legal heirs of deceased appellant No.11 namely Smt.Eramma. You are hereby noticed to appear before this Hon'ble Court on 16-03-2023 at 10-30 A.M either in person or through an Advocate to answer the above application, failing which, the matter will be decided in your absence and you will be made exparte.
// BY ORDER OF THE COURT//
Date of Hearing: 16-03-2023.
Sd/- Sri P.Jaya Theertha,
Smt.M.Suneetha,
Advocate for Petitioners, Adoni.

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE: KURNOOL AT ADONI.
I.A.NO. 109/2022 IN A.S.NO. 58/2011.
Between:
K.Jaffar Rahim and others. ...Petitioners.
Versus.
B.Venkata Subba Reddy and others. ...Respondent.
To,
The Respondents No.
8.S.Anjaneyulu S/o.Late Narayana Swamy, Hindu, aged about 59 years, resident of Door No.1-541-123, Raghavendra Nagar, Adoni Town, Kurnool District.
9.S.Krishna S/o.Late Narayana Swamy, Hindu, aged about 56 years, resident of Door No.1-541-123, Raghavendra Nagar, Adoni Town, Kurnool District.
Whereas the above named petitioners have filed this application requesting the Hon'ble Court to condone the delay of 572 days in filing the application to add you as respondents No.7 and 8 in the appeal A.S.No.58/2011 being the legal heirs of deceased appellant No.11 namely Smt.Eramma. You are hereby noticed to appear before this Hon'ble Court on 16-03-2023 at 10-30 A.M either in person or through an Advocate to answer the above application, failing which, the matter will be decided in your absence and you will be made exparte.
// BY ORDER OF THE COURT//
Date of Hearing: 16-03-2023.
Sd/- Sri P.Jaya Theertha,
Smt.M.Suneetha,
Advocate for Petitioners, Adoni.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు : ఆదోని
E.P.No.22/2021 IN O.S.No. 438/2017
Between:
1.శ్రీనివాసులు, S/o కె.సుబ్బయ్య,
ఇంటి నెం. 51-15-A/5G-2, బాబా బృందావన్ నగర్,
APSP Camp (PO), కర్నూలు- 518003. ...డిక్రీ హోల్డర్
V/s
ఎం.రమేష్ బాబు, తండ్రి ఎం.వాసుదేవయ్య,
ఇంటి నెం.40-301/13, జయలక్ష్మీ నిలయం,
శ్రీరామ సినిమా థియేటర్ ఎదురుగా,
కర్నూలు - 518003. ...జడ్జిమెంట్ డెటార్
Under Order-21 Rule-54 C.P.C. Notice to J.Dr.
To
J.Dr. -: ఎం. రమేష్ బాబు, S/o ఎం.వాసుదేవయ్య,
ఇంటి నెం. 40-301/13, జయలక్ష్మి నిలయం,
శ్రీరామ సినిమా థియేటర్ ఎదురుగా, కర్నూలు 18003.
పై తెలిపిన డిక్రీ హోల్డర్ E.P. మొత్తము బాకీ వసూలు నిమిత్తం క్రింద కనపరచిన J.Dr. యొక్క E.P. షెడ్యూలు ప్రాపర్టీని అటాచ్‌మెంట్ కొరకు మరియు వేలం నిమిత్తం పై కోర్టులో కేసు దాఖలు చేసినారు. పై కోర్టువారు నోటీసులు పంపినను తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా నీకు తెలియజేస్తు కేసు వాయిదా తేది: 09/03/2023 నాడు ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు స్వయముగా గాని, లేక వకీళ్ల ద్వారా అక్షేపణలు తెలుపవచ్చును. వాయిదాకు రానియెడల పై కోర్టువారు కేసును డిక్రీ హోల్డర్ పరముగా తీర్మానము చేయుదురు.
SCHEDULE
The land situated in Chinna Hyata Village in Holagunda Revenue Mandal limits within the Registration District and Sub-Registration District of Kurnool and Alur respectively.
(1) The land in Sy.No.291A extending Ac.3.56cents both survey number constitute on block.
(2) The land in Sy.No.292 extending Ac.0.68cents and bounded by
East : Kamma Asundi Rama Krishna land
West : CLI land
North : Vandavagili Polimera
South : Ramesh land
Market & D.Hr. Value : Rs.25,440/-
Construction Value : Rs.85,000/-
కోర్టు వారి ఆర్డరు మేరకు
కోర్టు వాయిదా తేది : 09/03/2023
శ్రీ ఎ.వేణుగోపాల్,
డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది, ఆదోని.
సెల్ నెం: 9440232527

వాలీబాల్ విజేత సుగుర్

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో దిగంబర దివానే మూగి తాత 38వ ఉరుసు సందర్భంగా నిర్వహించిన అంతర్‌రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో కర్ణాటక రాష్ట్రంలోని సుగుర్ జట్టు విజేతగా నిలిచింది. వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లకు సోమవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.40,016 సుగుర్-1 జట్టుకు దాత జడ్‌పిటిసి కిట్టు, రెండో బహుమతి రూ.30,016 అనంతపురం జట్టుకు దాత డిఫెన్స్ సోల్జర్స్, మూడో బహుమతి రూ.20,016 సుగుర్-2 జట్టుకు దాత నీలి ధ్రువ తేజ, నాలుగో బహుమతి రూ.10,016 గుంతకల్ జట్టుకు దాత వెంకటరెడ్డి, ఐదో బహుమతి రూ.8,016 దేవనకొండ జట్టుకు దాత నయారా పెట్రోల్ బంక్ యాజమాన్యం అందజేశారు.

ఎస్ఐఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా సోమన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న 'స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్' జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. సోమవారం సంస్థ ఛైర్మన్ డాక్టర్ ఈదా శామ్యూల్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఎస్ఐఎఫ్ జిల్లా కోశాధికారిగా గద్వాల సోమన్న పని చేశారు. 'బలవన్మరణాలు లేని భారతదేశం'గా చూడాలనే ధ్యేయంతో ముందుకు సాగుతున్న ఈ ఫౌండేషన్‌కు ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడం పట్ల సోమన్న సంతోషం వ్యక్తం చేశారు. మహోన్నత ఆశయాలతో, చిత్త శుద్ధితో అడుగులు వేస్తున్న నిస్వార్థ సేవా సంస్థతో కలిసి పని చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. తన మీద నమ్మకంతో ఎంపిక చేసినందుకు ఛైర్మన్ శామ్యూల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులు సోమన్నను అభినందించారు.

జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

- వివేక హత్య కేసులో సిబిఐ విచారణ వేగవంతం కావాలి - టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలనకు చరమగీతం పాడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం స్థానిక అబోడే హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లేదని, పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. నాలుగేళ్ల కాలంలో అభివృద్ధి శూన్యమని, వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుల విచారణను సిబిఐ వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీ అవినాష్ రెడ్డి పాత్రపై సిబిఐ విచారణలో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని, నారా లోకేష్ పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు కల్పించారో అందరికీ తెలిసిందేనని అన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, అబ్జర్వర్ భీమవరం కోళ్ల నాగేశ్వరరావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, పూజారి గోపాలకృష్ణ స్వామి, సోషల్ మీడియా విజయరామిరెడ్డి, బీసీ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, బీసీ జనరల్ సెక్రటరీ వట్టేప్ప గారి నరసింహ, చిన్న సుంకప్ప, ఏబు, గణేకంటి రఘు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గ్యాస్ ధర పెంపు అన్యాయం

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆమ్ ఆద్మీ పార్టీ నిరసన

ప్రజాశక్తి - ఆదోని

సామాన్యులపై వంట గ్యాస్ ధరలు పెంచడం అన్యాయమని ఆమ్ ఆద్మీ పార్టీ రాయలసీమ ఇన్‌ఛార్జీ సుబ్బారెడ్డి, ఆదోని కన్వీనర్ నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 మోపడం సరికాదన్నారు. ఇప్పటికే ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు బతకలేకపోతున్నారని తెలిపారు. 2014 నుంచి ఇప్పటివరకు గ్యాస్ ధర 200 శాతానికి పైగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. పెరిగిన ధరల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు బతకడం కష్టంగా మారిందన్నారు. వెంటనే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ అభ్యర్థి అక్బర్ హుస్సేన్, న్యాయవాది హుస్సేన్ సాని ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

నిందితుని చూపుతున్న పోలీసులు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని బదినేహాల్ గ్రామంలో జరిగిన చోరీ కేసును కౌతాళం పోలీసులు ఛేదించారు. సోమవారం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామానికి చెందిన బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఎరిగేరి రాందాస్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. అతని వద్ద ఉన్న 45 తులాల వెండి, రెండు తులాల బంగారంతో పాటు రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుని కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మండలంలోని ప్రజలు వలసలు వెళ్లినా, దూర ప్రాంతాలకు ప్రయాణించినా సొమ్ము, ఆభరణాలను బ్యాంకు లాకర్‌లో కానీ, సొంత బంధువుల వద్ద భద్రపరిచి వెళ్లాలని కోరారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 7 పోలింగ్ కేంద్రాలు'

ఆదోనిరూరల్ : నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 7 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ వెంకట లక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో 6,103 పట్టభద్రుల ఓటర్లు, 513 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈనెల 13న పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవటానికి మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ హైస్కూలులో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

- ఎస్ఐ శ్రీనివాసులు

పెద్దకడబూరు : ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. చట్టాలు, అసాంఘిక శక్తుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ సోమవారం మండలంలోని రంగాపురం గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు కూడా చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత మద్యానికి బానిస కావద్దని హెచ్చరించారు. దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకో

విరాళం ఇస్తున్న గుడిసె కృష్ణమ్మ

వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి - ఆదోని

మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కోసం టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ రూ.10 వేలు విరాళాన్ని వాల్మీకి నాయకులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గొప్ప వ్యక్తులు చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకునేందుకు విగ్రహాలు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు సహకరించడం ఎంతో తృప్తినిస్తుందన్నారు. మాజీ సర్పంచి మల్లికార్జున స్వామి, నాగరాజ్, శివ రాముడు, రాముడు, హనుమంతు, సీనప్ప, అయ్యప్ప, మూకప్ప, రామాంజి, హనుమంతు, దేవేంద్ర, నాగరాజ్, నాగేష్, మల్లేష్, చంద్ర పాల్గొన్నారు.

పాసింగ్ విధానాన్ని రద్దు చేయాలి

- ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ ధర్నా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మార్కెట్ యార్డులో పాసింగ్ విధానాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ నాయకులు కోరారు. సోమవారం ఆదోని మార్కెట్ యార్డు కార్యాలయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు బి.నర్సప్ప, బి.ఎల్లప్ప మాట్లాడారు. అమ్మకానికి వచ్చిన వేరుశనగ రైతులను పాసింగ్ పేరుతో నిలువునా మోసం చేస్తున్నారని తెలిపారు. ఆదోని వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన వేరుశనగను ఉదయం కమీషన్ ఏజెంట్ అంగడి దగ్గర ఉంచితే.. వాటికి ఉదయం 11 గంటలకు టెండర్లు వేస్తున్నట్లు చెప్పారు. టెండర్‌లో ధర అయిన తర్వాత వేరుశనగను రైతు ప్రమేయం లేకుండా ఇష్టానుసారంగా పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్‌లో ఎలాంటి పాసింగ్ చేయడం లేదని చెప్పారు. కేవలం ఆదోని మార్కెట్ యార్డులోనే కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. టెండర్ ఫారం వచ్చిన తక్షణమే తూకం వేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్, ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు బి.వెంకన్న, రాజు, సోమన్న పాల్గొన్నారు.

ఎంపి అవినాష్‌రెడ్డికి మళ్లీ సిబిఐ నోటీసులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిహత్య కేసుకు సంబంధించి విచారణలకు హాజరుకావాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డికి సిబిఐ అధికారులు ఆదివారం రాత్రి నోటీసులు అందజేశారు. వైఎస్ అవినాష్‌రెడ్డిని ఈ నెల పదిన హైదరాబాద్‌లోని సిబిఐ కార్యాలయానికి, వైఎస్ భాస్కర్‌రెడ్డిని 12న కడప సబ్ జైల్‌లోని అతిథి గృహంలో విచారణకు హాజరు కావాలని పేర్కొంది. ఇంతకు ముందే వీరిద్దరినీ సోమవారం హాజరుకావాలని నాల్గొవ తేదీన నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉండడంతో హాజరుకాలేమని తెలపడంతో పదిన విచారణకు రావాలని సిబిఐ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వేంపల్లిలో జరిగిన ఓ సమావేశంలో అవినాష్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ నోటీసులు ఇచ్చిన ప్రకారం ఈ నెల పదిన హైదరాబాద్‌లోని సిబిఐ ఎదుట హాజరు అవుతానని చెప్పారు.

పోలీసుల అదుపులో స్వాతిపై దాడి చేసిన నిందితులు

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు నిందితునిగా ఉన్న ఉమా శంకర్‌రెడ్డి భార్య స్వాతిపై దాడి చేసిన కొమ్మా పరమేశ్వరరెడ్డి, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌రెడ్డిలను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజుల క్రితం పరమేశ్వరరెడ్డి తనపై దాడి చేశారని ఆదివారం పోలీసులకు స్వాతి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వీరిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం.

7 ఎమ్మెల్యే కోటా
ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్

- 6 నుంచి 13 వరకు నామినేషన్లు
- 23న ఎన్నికలు, అదేరోజు కౌంటింగ్
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి పివి సుబ్బారెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి పివి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసనమండలిలో ఈ నెలాఖరుకు ఖాళీ అవుతున్న 7 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి రాష్ట్ర శాసనమండలి సంయుక్త కార్యదర్శి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పివి సుబ్బారెడ్డి సోమవారం ఫారం-1 ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. శాసనమండలి సభ్యులు చల్లా భగీరథరెడ్డి పదవీ కాలం గత నవంబరు 2వ తేదీతో పూర్తి కాగా, నారా లోకేష్, పోతుల సునీత, బచ్చుల అర్జునుడు, డొక్కా మాణిక్య వరప్రసాద్, పెనుమత్స వరాహ వెంకట సూర్యనారాయణరాజు, గంగుల ప్రభాకర్‌రెడ్డి పదవీకాలం ఈ నెల 29తో ముగియనుంది.

ఈ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖాళీల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 27న ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఎన్నికల ప్రకటనను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పివి సుబ్బారెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్ వేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్ ఫారాలను అభ్యర్థులు స్వయంగా కానీ, వారి ప్రతిపాదకుడు కానీ రాష్ట్ర సచివాలయంలోని శాసనసభా భవనంలో రిటర్నింగ్ అధికారిగా ఉన్న తన వద్ద కానీ, లేనిపక్షంలో సహాయ రిటర్నింగ్ అధికారి లేక, శాసనమండలి ఉప కార్యదర్శి వద్ద కానీ సమర్పించవచ్చని తెలిపారు.

ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు సెలవు దినాలు మినహా మిగతా పనిదినాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు. నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పొందచ్చని పేర్కొన్నారు. 14న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ భవనంలో నామినేషన్లు పరిశీలన ఉంటుందని, 16న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవాలనుకునే వారు అభ్యర్థిత్వ ఉప సంహరణ నోటీసును అభ్యర్థి లేదా వారి ప్రతిపాదకుడు లేదా రాత పూర్వకంగా అందించేందుకు అధికారం పొందిన వారి ఎన్నిక ఏజెంటు కానీ రిటర్నింగ్ అధికారి లేదా సహాయ రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ ఉన్న పక్షంలో ఈ నెల 23న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అసెంబ్లీ భవనంలో పోలింగ్ జరగనుందని సుబ్బారెడ్డి తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

బడ్జెట్‌కు తుది మెరుగులు

- రూ.2.95 లక్షల కోట్లకు చేరుకునే అవకాశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వార్షిక బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దే కసరత్తు జరుగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు ఇప్పటికే మెరుగులు దిద్దగా, దానికి తుది రూపునిచ్చేందుకు ముఖ్యమంత్రి వద్దకు బడ్జెట్ ఫైలు పంపించేందుకు కూడా ఆర్థికశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్వల్పంగా మార్పులు, చేర్పులకు కూడా ముఖ్యమంత్రి సూచనలు చేసే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు.

మొత్తమ్మీద ఈసారి బడ్జెట్ రూ.2.95 లక్షల కోట్ల వరకు చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంబంధించిన బడ్జెట్‌ను ప్రాథమికంగా సిద్ధంచేసి ముఖ్యమంత్రి పేషీకి అందించినట్లు తెలిసింది. అక్కడ దీనిని అధ్యయనం చేసి తుది బడ్జెట్ అంకెల కోసం ముఖ్యమంత్రికి సమర్పిస్తారని సమాచారం. రెవెన్యూ వ్యయమే కీలకంగా ఉంటున్న ఈ బడ్జెట్‌లో గతం కన్నా ఎక్కువగానే సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేస్తున్నట్లు తెలిసింది. గతేడాది మొత్తం రూ.2.56 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఒక్క రెవెన్యూ వ్యయానికే రూ.2.08 లక్షల కోట్ల వరకు కేటాయింపులు చేశారు. అదే వచ్చే బడ్జెట్‌లో రూ.2.38 లక్షల కోట్ల వరకు కేటాయింపులు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ కేటాయింపులపైనే ముఖ్యమంత్రి మరోసారి అధికారులతో చర్చించి తుది అంకెలను ఖరారు చేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల సంఖ్యపై కోతలు పడుతున్నట్లు వస్తున్న విమర్శలపైనా ఆర్థికశాఖ, ముఖ్యమంత్రి కార్యాలయాలు దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల బడ్జెట్ కావడంతో ప్రజల నుంచి విమర్శలు పెరగకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆర్థికశాఖ అధికారులకు సూచనలు వెళ్లినట్లు తెలిసింది. లబ్ధిదారుల సంఖ్య, వారికి కేటాయించే నిధుల్లో భారీగా అంతరం లేకుండా బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దాలని కూడా సూచనలు వెళ్లినట్లు తెలిసింది. మొత్తం ప్రక్రియను 15వ తేదీలోగా పూర్తి చేయాలని నిర్ణయించడం గమనార్హం.

ధర్నా చౌక్‌వద్ద ఆందోళన చేస్తున్న రైతు, కౌలు రైతులు, నాయకులు

ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కళ్లల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నా చౌక్‌వద్ద సోమవారం ధర్నా జరిగింది. ఎపి రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని ఘంటసాల, పమిడిముక్కల మండలాల రైతు, కౌలు రైతులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు మాట్లాడుతూ.. టార్గెట్ పూర్తయిందన్న పేరుతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేయడం దారుణమన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ధాన్యం కళ్లాలోనే ఉందని, ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ నిలిపివేయడంతో ఎవరికి అమ్మాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ జిల్లాలో 30 శాతం ధాన్యం కుప్పల పైనే ఉందని తెలిపారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అనంతపురంలో ఉద్రిక్తత

- రాళ్లు రువ్వుకున్న టిడిపి, వైసిపి అనుయాయులు
- సోషల్ మీడియా పోస్టులతో మొదలైన వివాదం

రాళ్లదాడిలో గాయపడిన కానిస్టేబుల్

హరికృష్ణను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

వైసిపి, టిడిపి నేతల పరస్పర దాడులతో అనంతపురం జిల్లా కేంద్రం ఉద్రిక్తంగా మారింది. సోషల్ మీడియా వేదిక ద్వారా మొదలైన వివాదం ఒకరిపై ఒకరు భౌతిక దాడులు చేసుకునేంత వరకూ వెళ్లింది. సోమవారం ఉదయం టవర్ క్లాక్ వద్ద చోటు చేసుకున్న ఈ దాడుల ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ దాడిలో ఓ కానిస్టేబుల్, టిడిపి కార్యకర్తకు గాయాలయ్యాయి. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్‌లను విమర్శిస్తూ గుంటూరుకు చెందిన వైసిపి సోషల్ మీడియా కార్యకర్త హరికృష్ణారెడ్డి తన ఫేస్‌బుక్‌లో రెండు రోజుల క్రితం ఓ పోస్టును పెట్టారు. దీనికి ప్రతిగా టిడిపి కార్యకర్తలు సైతం ఆయనను విమర్శిస్తూ పోస్టులు పెట్టారు. పరిటాల కుటుంబం అవినీతి, హత్యా రాజకీయాలను రాప్తాడు, అనంతపురంలోనే వివరిస్తానంటూ హరికృష్ణారెడ్డి మరో పోస్టు పెట్టారు. సోమవారం ఉదయం తాను అనంతపురం వస్తానని ఓ వీడియో సందేశానిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం రాప్తాడు నియోజకవర్గానికి వచ్చారు. తాను వైసిపి కార్యాలయం వద్ద ఉన్నానని తనతో మాట్లాడే వారు ఎవరైనా ఉంటే రావొచ్చని సోషల్ మీడియా ద్వారా సవాల్ విసిరారు. అనంతరం అక్కడి నుంచి వైసిపి మద్దతుదారులతో కలిసి అనంతపురం టవర్‌క్లాక్ వద్దకు ఆయన వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి మద్దతుదారులు, పరిటాల అభిమానులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. టిడిపి, వైసిపి నాయకులు ఎదురెదురుపడడంతో ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్‌కు టిడిపి కార్యకర్తకు రాళ్లు తగిలి తలకు బలమైన గాయాలయ్యాయి. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరుగ్రూపులను చెదరగొట్టారు. గుంటూరు నుంచి వచ్చిన హరికృష్ణారెడ్డిని బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. టిడిపి మద్దతుదారులనూ అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఉద్రిక్తతకు కారణమైన వారిపై కేసులు

ప్రతి నెలా ఒక పరిశ్రమైనా వచ్చేలా చూస్తాం

- రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

మీడియాతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

ప్రతి నెలా కనీసం ఒక పరిశ్రమైనా వచ్చేలా చర్యలు చేపట్టనున్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖ సీతమ్మధారలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని సహజ వనరుల గురించి బయటి ప్రపంచానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సిఎం జగన్మోహన్‌రెడ్డి బ్రాండ్ కనిపించిందని, దేశమంతా ఈ సమ్మిట్ గురించే చర్చించుకుంటోందని పేర్కొన్నారు. ఈ సమ్మిట్ వల్ల రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 352 ఎంఒయులు, తద్వారా ఆరు లక్షలకుపైగా ఉద్యోగాలు కల్పించే దిశగా అడుగులు పడ్డాయని చెప్పారు. దేశంలోని మూడు కీలక కారిడార్లు ఎపి మీదుగా సాగడం మంచి పరిణామమన్నారు. దేశంలోనే అధిక వనరులు ఉన్న జిల్లా విశాఖ అని పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 40 వేల ఎకరాలు స్థలాన్ని పరిశ్రమల కోసం సిద్ధంగా ఉంచామన్నారు. పారిశ్రామికవేత్తలు కోరుకునే వివాద రహిత స్థలం, నిరంతర విద్యుత్, నీటి సరఫరా ఎపిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో కొన్ని అంశాలకే ప్రధాన్యత ఉంటే ఎపిలో మాత్రం 14 రంగాల్లో పెట్టుబడులకు అనువైన పరిస్థితి వుందని చెప్పారు. రెన్యువబుల్ ఎనర్జీలో పెట్టుబడులు పుష్కలంగా వచ్చాయన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఎవరైనా పెట్టుబడులకు ముందుకు రావొచ్చని తెలిపారు. పెట్టుబడుల సదస్సు చూసిన తర్వాతైనా ప్రతిపక్ష పార్టీలో మార్పు వస్తుందని ఆశిస్తున్నానన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కూడా విండ్ లేదంటే సోలార్ పవర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. త్వరలోనే మచిలీపట్నం, భావనపాడు పోర్టుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ఐటి రంగంలో రూ.35 వేల కోట్ల విలువైన ఒప్పందాలు జరిగాయని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె రాజు పాల్గొన్నారు.

సోమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న గపూర్‌మియ్యా, తదితరులు

ప్రజా సమస్యలపై పోరాడిన సోమన్న

ప్రజాశక్తి-కోడుమూరు

ప్రజాసమస్యలపై నిరంతరం సోమన్న పోరాటం చేశారని కోడుమూరు సిపిఎం మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా అన్నారు. కోడుమూరులో సుందరయ్య భవన్‌లో సోమన్న ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. సోమన్న కోడుమూరు డివిజన్ కార్యదర్శిగా 11 సంవత్సరాల పాటు సేవలందించారన్నారు. సోమన్న పార్టీ పట్ల ఎంతో చిత్తశుద్ధితో పనిచేసే వ్యక్తి అన్నారు. విద్యార్థి దశ నుండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేస్తూ డివిజన్ కార్యదర్శి స్థాయికి ఎదిగారు. కోడుమూరు డివిజన్లో గూడూరు, సి.బెళగల్ , కోడుమూరు, కర్నూలు రూరల్ మండలం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై తాగునీరు సాగునీరు వంటి సమస్యలపై రాజీలేని పోరాటం చేశారన్నారు. అలాంటి వ్యక్తి చిన్న వయసులో అనారోగ్యం వల్ల మరణించడం చాలా బాధాకరమని, సోమన్న తన కుటుంబం కన్నా పార్టీకే ఎక్కువ శ్రద్ధ చూపించేవాడన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.రాజు మండల కమిటీ సభ్యులు టి.వీరన్న, సిఐటియు మండల కార్యదర్శి. జిపి వీరన్న జిఎంపిఎస్ మండల కార్యదర్శి మద్దిలేటి సిపిఎం సీనియర్ నాయకులు జికె. నరసింహమూర్తి,చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మన్న, భవన నిర్మాణ సంఘం కార్యదర్శి సుంకన్న , డివైఎఫ్ఐ నాయకులు బి.రాజు చేనేత సంఘం నాయకులు గిడ్డయ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మధుబాబు, నాగరాజు, అయ్యస్వామి, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న కెవి సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలతారెడ్డి

మహిళ క్రీడాకారులకు అన్నదానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా మహిళా ఉద్యోగులకు, ఉపాధ్యాయురాళ్లకు నిర్వహించిన క్రీడల సందర్భంగా కెవి.సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత వైసిపి సీనియర్ నాయకులు కెవి.సుబ్బారెడ్డి 17వ వార్డు కార్పొరేటర్ క్లైప పద్మలత రెడ్డి విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. 3 రోజులు వివిధ రకాల గేమ్స్ 17వ వార్డులోని కలెక్టర్ ఆఫీస్ సునయన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నారు. వారికి సోమవారం మొదలుకొని బుధవారం వరకు మూడు రోజులు ఉచిత మధ్యాహ్నం భోజనాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.వచ్చిన అవకాశాలను వినియోగించుకుని మహిళలు అన్ని రంగాల్లో ముందుకు నడవాలని వారు కోరారు.

సమిష్టి కృషితో రోడ్డు ప్రమాదాలు నియంత్రణ : ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

రోడ్డు భద్రతపై జిల్లా పోలీసు యంత్రాంగం సమిష్టిగా కృషి చేసి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. గత నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు తీసుకున్న చర్యల వివరాలను సోమవారం విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా... వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై 608 కేసులు నమోదు చేశామన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 7,761 కేసులు, మైనర్ల పై 55 కేసులు, ఒన్ వేలో రాంగ్ రూట్ వెళ్ళిన వారిపై 59 కేసులు, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారి పై 176 కేసులు, జంపింగ్ సిగ్నల్ పై 7 కేసులు, ఎలాంటి రికార్డులు పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారి పై 10,086 కేసులు, సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు , జీపులు , తదితర వాహన చోదకుల పై 572 కేసులు నమోదు చేశామన్నారు. అతి వేగంతో వెళ్లిన వాహనాల పై 2,054 కేసులు, ఓవర్ లోడ్‌తో వెళ్ళిన వాహనాల పై మోటారు వాహనాల చట్టం కింద 300 కేసులు, ట్రిపుల్ రైడింగ్ పై 778 మంది కేసులు, రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాల పై 837 కేసులు, రాంగ్ పార్కింగ్ చేసిన త్రీ వీలర్ , ఫోర్ వీలర్ వాహనాల పై 490 కేసులు చేసి, నంబర్ ప్లేట్ లేని 375 వాహనాలు సీజ్ చేశామన్నారు. డ్రంకెన్ డ్రైవింగ్ పై 176 కేసులు నమోదయాయన్నారు. మొత్తం 5 లక్షల 39 వేల ఈ చలనాలు పెండింగ్ లో ఉన్నాయని , ఫిబ్రవరి నెలలో 25,976 ఈ చలనాలను (రూ. 48 లక్షల 23 వేల 210 రూపాయలను) రికవరీ చేశామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినా , రహదారులపై ఇబ్బందికరంగా వాహనాలు నిలిపినా వెంటనే డయల్ 100 కు సమాచారం చేరవేయాలని జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓల్డు సిటీలో ప్రచారం చేస్తున్న రాజశేఖర్, రామకృష్ణ, షరీఫ్

శాసనమండలికి ప్రశ్నించే వారిని గెలిపించాలి : ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ప్రజాసమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు గెలిపించాలని సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎం. రాజశేఖర్, నాయకులు కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై గళం విప్పే పోతుల నాగరాజును గెలిపించాలని ఎసిబి డిఎస్‌పి శివ నారాయణ స్వామిని కోరారు. రాయలసీమ జిల్లాల అభివృద్ధి కోసం అనేక పోరాటాలు చేసిన వ్యక్తి, అదేవిధంగా పాలక ప్రతిపక్ష పార్టీలు ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తుంటే దానికి వ్యతిరేకంగా పోరాడి ఆయా సమస్యలపై ప్రజలను ఉద్యమాల వైపు నడిపించిన ఉద్యమకారుడు పోతుల నాగరాజు అని అన్నారు.

పోతుల నాగరాజుకు గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి-వెల్దుర్తి: వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట పుల్లగుమ్మి కలుగొట్లలో పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. పోతుల నాగరాజుకు 198 ఉద్యోగ కార్మిక విద్యార్థి యువజన ప్రజా సంఘాల మద్దతు తెలిపాయని వారు ఓటర్లకు సూచించారు. ఉన్నత విద్యావంతులు వెళ్లాల్సిన వేదికకు పోతుల నాగరాజు సరైన అభ్యర్థి అని తెలిపారు. శాసనమండలిలో ప్రజా గొంతుక ఉండాలి అంటే సీరియల్ నంబర్ 27 పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, సిఐటియు మండల కార్యదర్శి రామ నాయుడు, నాయకులు మద్దిలేటి, మధు, శేఖర్, మద్దయ్య, ప్రజాశక్తి రిపోర్టర్ అంజి పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

కర్నూలు నగరంలోని, రెండో వార్డు నందు గల ఉత్తరాదిమటంలో, పిడిఎఫ్, బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును, టీచర్స్ నియోజకవర్గం అభ్యర్థి, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని, ఆవాజ్ నగర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ షరీఫ్, ఆవాజ్ నగర నాయకులు, గని ఖాన్, గౌస్ బాషా, ఖలీల్, సిఐటియు నాయకులు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, శేఖర్, ఫిలప్, రాజేంద్ర బాబు తదితరులు కలసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, వేయించాలని కోరుతూ సోమవారం ప్రచారం నిర్వహించారు. మహమ్మద్ షరీఫ్, మద్దిలేటి, మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి ప్రజా ప్రతినిధులు ఏ ఒక్కరు కూడా, సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడటం లేదన్నారు. పిడిఎఫ్, ఇతర ప్రజా సంఘాలు, వామపక్షాలు, కాంగ్రెస్, జనసేన ఉద్యోగ, ఉపాధ్యాయ , కార్మిక సంఘాలు, మేధావులు, బలపరుస్తున్న పోతుల నాగరాజుని కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని వారు పట్టభద్రులను టీచర్ నియోజకవర్గ ఓటర్లను కోరారు.

శ్రీనివాసాచారికి జోహార్లు అర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, రాముడు, నారాయణ

పోరాటాలకు సహకరించిన శ్రీనివాసాచారి

వడ్ల శ్రీనివాసాచారి సంస్మరణ సభలో ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

వడ్ల శ్రీనివాసాచారి ప్రజా పోరాటాలకు సహకరించే వారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శ్రీనివాసాచారి సంస్మరణ సభ సుందరయ్య భవన్లో సోమవారం నిర్వహించారు. ఈ సభకు సిపిఎం న్యూ సిటీ కమిటి కార్యదర్శి టి.రాముడు అధ్యక్షత వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ .శ్రీనివాసాచారి జీవితాంతం వరకు ప్రజాశక్తి పాఠకుడిగా ఉండేవారన్నారు. వేల్పనూరులో ప్రధానోపాధ్యాయులుగా పదవి విరమణ చేశారని అన్నారు. సిపిఎం సానుభూతిపరుడుగా ఉంటూ పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు సంపూర్ణ సహాయ సహకారాలను అందించేవారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన కూతురు సరస్వతి, అల్లుడు రవి ప్రకాష్ లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. రామాంజనేయులు, కెవి.నారాయణ, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎ. సుభాన్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు సాయిబాబా, నరసింహులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నగర నాయకులు హుస్సేన్ బాష, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, హుస్సేనయ్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురు శేఖర్, ఎస్ డబ్ల్యు ఎఫ్ నాయకులు దివాకర్, ఐద్వా జిల్లా నాయకురాలు సుజాత, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో అధ్యాపకులు , ప్రిన్సిపల్

సిల్వర్ జూబ్లీ విద్యార్థినిల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : నగరంలోని స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినిలు కవితలు , పెయింటింగ్ వేసి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మహిళా సాధికారితపై విద్యార్థులు వేసిన అలా నైపుణ్యాలను చూసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ అభినందించారు. విద్యార్థినిలను మహిళా విభాగం అధ్యా పకులు డాక్టర్ అక్తర్‌భాను ఇతర అధ్యాపకులు కూడా వారిని అభినందించారు.

క్లౌడ్ కంప్యూటింగ్ పై ఉపన్యాసం

నగర శివారులలోని జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో క్లౌడ్ కంప్యూటింగ్ పై న్యూటానిక్స్ సంస్థ సీనియర్ టెక్నీషియన్ కిరణ్ పలు విషయాలపై ఉపన్యాసించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు పలు విషయాలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డి.జయ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండే ఎండ

- మొదలైన భానుడి భగభగలు
- గతేడాది కంటే 3 డిగ్రీలు అధికం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి మొదటి వారంలోనే భానుడి భగభగలు మొదలయ్యాయి. గతేడాదితో పోలిస్తే 3 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

మార్చి మొదటి వారంలోనే భానుడు భగభగలాగుతున్నాడు. జిల్లాలో వేసవి తీవ్రత ఆరంభమైంది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సోమవారం నంద్యాల, చాగలమర్రి, ఆళ్లగడ్డలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోద్దైంది. ఆత్మకూరులో 36 డిగ్రీలు, డోన్‌లో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోద్దైంది. గతేడాది ఇదే సమయానికి అత్యధికంగా 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 3 డిగ్రీల మేర పెరిగింది. మార్చి తొలి వారంలోనే ఇంత తీవ్రంగా ఎండలు కాస్తుంటే రాబోయే రోజుల్లో ముఖ్యంగా ఉగాది నుంచి మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

దీర్ఘకాలక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

ఎగువలో వైభవంగా రథోత్సవం

- దిగువలో కాలింగ నర్తనోత్సవం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు 46వ పీఠాధిపతి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఎగువ అహోబిలంలో రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులైన జ్వాలా నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం రథంలో ఆశీనులను చేసి అహోబిల మాడ వీధుల గుండా వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించలేని భక్తులు రథోత్సవంను తిలకించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దిగువ అహోబిలంలో : అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రహ్లాద వరద స్వామికి కాలింగునిపై నృత్యం చేస్తున్నట్లు అర్చకులు అలంకరించారు. ఈ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవ మూర్తులు ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా అహోబిల మఠం చేరుకున్న స్వామివారికి పీఠాధిపతి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాన్ని ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలా చార్యులు వేదమంత్రాల మధ్య నిర్వహించారు. సాయంత్రం తొట్టి తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ప్రహ్లాద వరదస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వ వాహనంపై కొలువుంచి అహోబిల మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

ఇంటర్, ఎస్ఎస్‌సి పరీక్షలు

పకడ్బందీగా నిర్వహించండి

- జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 15 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు, ఏప్రిల్ 3 నుండి 18వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 51 పరీక్షా కేంద్రాల్లో 26,970 మంది విద్యార్థులు, 10వ తరగతికి సంబంధించి 125 పరీక్షా కేంద్రాల్లో 25,411 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు కేటాయించిన విధులు బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద పారిశుధ్యంతోపాటు తాగునీటి వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో అత్యవసర మందులతో ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు అనుకూలంగా అన్ని రూట్లలో ఆర్టీసి బస్సులు నడపాలని ఆర్‌టిసి అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలను మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షలు ముగిసిన తర్వాత సమాధాన పత్రాలను పార్శిల్ ద్వారా డిస్పాచ్ చేసేందుకు మధ్యాహ్నం 3 గంటల వరకు అనుమతించాలని పోస్టల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి పుల్లయ్య, ఆర్ఐఒ గురువయ్య శెట్టి, డిఇఒ అనురాధ, డిఐఇఒ సునీత, మునిసిపల్ కమిషనర్ రవీంద్రారెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ప్రముఖ నాయకుల వాల్ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు వాటిని చూసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ప్రముఖుల నాయకుల ఫ్లెక్సీలను తీయకపోవడం శోచనీయం. వెంటనే ఫ్లెక్సీలు తొలగించాలని పలు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

మిడుతూరు బస్టాండ్ సెంటర్లో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్న దృశ్యం

ఊపందుకున్న 'ఎమ్మెల్సీ' ప్రచారం

- ప్రలోభాలతో గెలవాలని అధికార పార్టీ
- అజెండా లేని అధికార, ప్రతిపక్ష అభ్యర్థులు
- ప్రజా, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలే అజెండాగా పిడిఎఫ్ అభ్యర్థులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్/బండి ఆత్మకూరు

నంద్యాల జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కేవలం గెలుపే లక్ష్యంగా అజెండా లేకుండా అధికార, ప్రతిపక్ష పార్టీల తరుపున పట్టభద్రుల అభ్యర్థులుగా వెన్నపూస రవీంద్రారెడ్డి, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, అధికార పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డి బరిలో ఉన్నారు. ప్రజా సమస్యలు, ఉపాధ్యాయ, ఉద్యోగుల, కార్మికుల కర్షకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, సీపీఎస్ రద్దు వంటి సమస్యలే ప్రధాన అజెండాగా పిడిఎఫ్ అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో దిగారు. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అధికార పార్టీ, ప్రతిపక్షం తీవ్రంగా ప్రయత్నిస్తుండగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలుపునకు అంచున ఉన్నారు. ప్రజా సమస్యలు, ఉద్యోగ ఉపాధ్యాయ, సమస్యలే అజెండాగా పిడిఎఫ్ అభ్యర్థులు కత్తి నరసింహ్మారెడ్డి, పోతుల నాగరాజులు ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ, వాపక్షాలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజా సంఘాలు, ఉద్యోగులు ఉపాధ్యాయులు పట్టభద్రులు, విద్యావంతులు మేధావులు బలపరుస్తున్న పిడిఎఫ్ తరపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజు బరిలో ఉండగా అధికార పార్టీ తరపున పోటీ చేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి, టీడీపీ తరుపున భూమి రెడ్డి రామగోపాల్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలిచారు. పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో ఎంతో అవసరం ఉందని, వీరి గెలుపు పేద మధ్యతరగతి ఉద్యోగులు ఉపాధ్యాయుల, కార్మికుల కర్షకుల గొంతుకగా శాసనమండలిలో ప్రజా వాణి వినిపించాలని ఆకాంక్షతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఉమ్మడి అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి పోతుల నాగరాజుల గెలుపుకు ప్రచారం నిర్వహిస్తూ పట్టభద్రులను ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధులు సభలు సమావేశాలు పెట్టి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ తన అధికార బలాన్ని ఉపయోగించి ప్రచారాన్నీ చేపడుతున్నారు. ప్రైవేట్ స్కూల్లో నేరుగా సమావేశాల ఏర్పాటు చేసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని, పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస రవీంద్రారెడ్డిలకు ఓటు వేస్తే తర్వాత యాజమాన్యాలకు తగిన ప్రతిఫలం అందిస్తామని నేరుగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను తుంగలో తొక్కి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుకోసం వాలంటీర్ల ద్వారా నంద్యాలలో కౌన్సిలర్లు ప్రచారం చేయిస్తున్నారు. సచివాలయ పరిధిలో కూడా వాలంటీర్ల ద్వారా, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఓటర్లను గుర్తించే పని వాలంటీర్లకు అప్పగించారు. ఎక్కడైతే ఓటర్లు ఉన్నారో అక్కడికి వాలంటీర్ల ద్వారా వెళ్లి అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రచారం చేస్తున్నారు. నంద్యాల దేవనగర్, డోన్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లో వాలంటీర్లు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీల గెలుపునకు ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థికి ప్రైవేటు ఉపాధ్యాయులు ఓటు వేయడానికి ఒక్కొక్కరికి రూ.5వేలు, పట్టభద్రుల అభ్యర్థికి రూ.2వేల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అధికార పార్టీకి అనుకులంగా ఉన్న ప్రయివేట్ స్కూళ్ల యాజమాన్యల ద్వారా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది.

పోతుల నాగరాజును గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పోటీలను ప్రారంభిస్తున్న డిఎస్‌పి

రాతి దూలం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా సోమవారం రాష్ట్ర స్థాయి రాతి దూలం పోటీలు ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలలో గెలుపు, ఓటములు సహజమన్నారు. రాతి దూలం పోటీలలో పాల్గొనే వారికి బహుమతులే కాకుండా ప్రతి ఒక్కరు చేయుతనివ్వాలన్నారు. కమిటీ అధ్యక్షుడు ముల్లా లాలు సాహెబ్, సర్పంచ్ బంగారు షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది జతల వృషభరాజములు పాల్గొనడం సంతోషదాయకమన్నారు. అనంతరం కమిటీ సభ్యులు అతిథులైన డిఎస్‌పి సుధాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ రూరల్ సిఐ రాజశేఖరెడ్డి, ఎస్ఐ రమణయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల షరీఫ్, గౌస్‌పీరా, కమాల్‌బాష, బడే సాహెబ్, నర్సయ్య, రబ్బాని, దద్దనాల జబ్బార్, బియ్యం షబ్బీర్, లాయర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు సందర్భంగా పారిశుధ్య పనులు : మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా సర్పంచ్ బంగారు షరీఫ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు,హెల్త్ సూపర్‌వైజర్‌లు రామచంద్రుడు, ప్రమీలమ్మల పర్యవేక్షణలో మురికి కాలువలను శుభ్రపరచి, వృధా నీరు ఉన్న చోట బ్లీచింగ్, వేస్టాయిల్ చల్లించారు. ఆరోగ్య కార్యకర్త భూదేవి , ఆశ కార్యకర్తలు, జిఎంఎస్‌కె లక్ష్మిప్రియ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు

10న మస్తాన్‌వలి ఉరుసు

ప్రజాశక్తి - పాములపాడు

ఈ నెల 9, 10వ తేదీన కంబాలపల్లెలో మస్తాన్ వలి ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 9న గంధం, 10వ తేదీ ఉరుసు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొనిమొక్కుబడులను తీర్చుకుంటారని తెలిపారు. భక్తులందరు ఉరుసు మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని జనాబ్ షేక్ బాదుల్లా సాహెబ్, నిర్వాహకులు కోరారు.

అన్నం పెట్టడం లేదు.. ఇంటి నుంచి గెంటేశారు..

- జిల్లా ఎస్‌పికి కుమారుడిపై తండ్రి ఫిర్యాదు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'మా పెద్ద కుమారుడు నేను ఉన్న ఇల్లు లాక్కొని ఇంటి నుంచి బయటికి గెంటేశాడు. అన్నం పెట్టడం లేదు. ఇంట్లో ఉండనీయడం లేదు. వేధిస్తున్నాడు. నాకు న్యాయం చేయండి' అని డోన్ పట్టణానికి చెందిన జి.గంగిరెడ్డి జిల్లా ఎస్‌పికి మొర పెట్టుకున్నాడు. సోమవారం నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఫిర్యాదిదారుల నుంచి జిల్లా ఎస్పీ మొత్తం 57 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్ట పరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ , ఎస్సీ,ఎస్టీ సెల్ డిఎస్పి రామంజి నాయక్ పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

– రైల్వేలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఉన్నాయని, రూ. 2 లక్షల 50 వేలు కడితే ఉద్యోగం ఇప్పిస్తానని వై.హరి ప్రసాద్, మరికొందరు డబ్బులు తీసుకుని మోసం చేశారని డోన్ పట్టణంలోని టిఆర్ నగర్‌కు చెందిన విజయభాను జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

– కాంట్రాక్ట్ బేసిక్ కింద శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పనులు చేయించుకుని కాంట్రాక్టర్ పార్వతమ్మ డబ్బులు ఇవ్వడం లేదని ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన గోకారి, నారాయణలు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్‌పి రఘువీర్ రెడ్డి

అదాని ఆస్తులను జప్తు చేయాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం

గౌతం అదాని ఆస్తులను కేంద్ర ప్రభుత్వం జప్తు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం శ్రీశైలం మండల కేంద్రంలో ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చెంచు గిరిజనులకు ఉపాధి పనులు జనరల్‌లో కలపడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, యధావిధిగా ఐటిడిఎ నుండి ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, మండల అధ్యక్షుడు శీను, మల్లికార్జున, వెంకటేశ్వర, వీరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ

ప్రజాశక్తి- ఆళ్లగడ్డ

అహోబిలం బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తులకు నృసింహ సేవా వాహిని సంస్థ వ్యవస్థాపకులు కృష్ణ చైతన్య స్వామి సూచన మేరకు కర్నూల్ జిల్లా ఇంచార్జ్ రవి కాంత్ చౌదరి సారథ్యంలో మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. సోమవారం ఎగువలో రథోత్సవాన్ని పురస్కరించుకొని వేలాది మంది భక్తులకు మజ్జిగ, మంచి నీరు అందించారు. ఈ సందర్భంగా రవికాంత్ చౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు వివిధ రకాల సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప్పాల ప్రసాద్, నృసింహ సేవావాహిని సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ, నిరుద్యోగ హక్కుల కోసం

ప్రశ్నించే వారిని ఎమ్మెల్సీలుగా గెలిపిద్దాం

- మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉపాధ్యాయ, నిరుద్యోగ హక్కుల కోసం ప్రశ్నించే వారిని ఎమ్మెల్సీలుగా గెలిపిద్దామని మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్ పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు విజయం కోసం నంద్యాల పట్టణంలోనిఎస్పిజి హైస్కూల్, హెూలీ క్రాస్, సెయింట్ జోషేప్, సెయింట్ జాన్స్, సిఎస్ఐ, మోడల్, మార్నింగ్ స్టార్, నవజ్యోతి అంధుల పాఠశాల, నారాయణ విద్యాసంస్థల్లో సోమవారం విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యోగుల న్యాయమైన సమస్యలపై ప్రశ్నించే వారిని గెలవనీయకుండా అధికార పార్టీ కుట్రలు పన్నుతోందని అన్నారు. నోట్లతో ఓట్లు కొనే విష సంస్కృతిని పెంచి పోషిస్తున్నారని అన్నారు. క్రిస్టియన్ మైనార్టీలకు, ఆయా విద్యాసంస్థలకు ఎటువంటి నిధులు ఇవ్వడం లేదని, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, వారి ఆస్తులకు రక్షణ లేదని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు వారి విద్యా సంస్థలు రెన్యువల్ 10 సంవత్సరాలు ఉండగా 3 సంవత్సరాలకు కుదించడం దారుణమన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం పిల్లలకు రావాల్సిన బుక్స్ కోసం డబ్బులు కట్టించుకొని ఇంత వరకు బుక్స్ రాలేదని, ఆ అంశం గురించి ఏ ఒక్క మాట కూడా మాట్లాడని అదే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం నుండి పోటీ చేస్తున్న వారికి ఓటు వేస్తే ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని అన్నారు. అందుకోసమే పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్, ఎఐటియుసి మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.రంగనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ, బికేఎంయు జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు : విద్యావంతులు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు కోరారు. మిడుతూరులో వ్యకాసం మండల అధ్యక్షులు టి.ఓబులేసు, సిఐటియు మండల అధ్యక్షులు లింగస్వామి, గ్రామస్తులు సుజ్ఞానం, జయరాముడు తదితరులు కలిసి ప్రవేట్ స్కూల్స్, కస్తూర్బా స్కూల్స్, మోడల్ స్కూల్, ఎంపీడీవో, ఎమ్మార్వో, హాస్పిటళ్లలో పట్టుభద్రులను కలిసి పిడిఎఫ్ బలపరిచిన పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. పోతల నాగరాజును 175 ప్రజాసంఘాలు, జనసేన, కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్నాయని తెలిపారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ పోతుల నాగరాజుకి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహ రెడ్డికి మొదటి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మునిపాటి చిన్న మారెన్న, మండల కార్యదర్శి డి.నాగరాజు, జి.నాగసైదయ్య, మండల సహాయ కార్యదర్శి యం మల్లికార్జున, భవన నిర్మాణ సంఘం (మిగతా 6వ పేజీలో..)

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్

సుస్థిర ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి

ఎపి గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయోత్సవ సంబరాల్లో డోన్ మున్సిపల్ ఛైర్మన్

కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్ : ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సిఎం దార్శని కతకు నిదర్శ నమని, రాష్ట్రాభివృద్ధి అవ కాశా లేంటో ప్రపంచానికి చాటి చెప్పిందని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా సోమవారం డోన్ మున్సిపల్ ఛైర్మన్ నాయకత్వంలో ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి , నాయకులు , కార్యకర్తల సమక్షంలో కేట్ కట్‌చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ఆర్థిక మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సప్తశైల రాజేష్ మాట్లాడుతూ సమ్మిట్లో మొత్తం 352 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడంతో రూ.13 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులకు, 20 రంగాల్లో దాదాపు ఆరు లక్షల ఉద్యోగాల కల్పన సాధ్య మవుతోందన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్ రఫి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి - శ్రీశైలం : పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం శ్రీశైల దేవస్థానం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించింది. సాయంకాలం స్వామి అమ్మవార్లకు మహా మంగళహారతులు, అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, భక్తులు, సాధువులు, స్థానికులు పాల్గొన్నారు.

రౌడీ పాలనకు స్వస్తి పలకాలి : టిడిపి

ప్రజాశక్తి - కొత్తపల్లి : రాష్ట్రంలో రౌడీ పాలనకు స్వస్తి పలకాలని, ఓటమి భయంతోనే వైసిపి దాడులు చేస్తుందని టిడిపి మండల నాయకులు శివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వీరాపురం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం చెందాయని, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అన్ని వర్గాలు సుభిక్షంగా వున్నారని ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో వైసిపి విధ్వంసకర పాలన చేస్తుందన్నారు. వైసిపికి ఓటమి భయం పట్టుకునే జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాద యాత్రకు అడుగు అడుగునా అడ్డంకులు సృష్టిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు నాగశేషులు, శంకర్ నాయక్, పుల్లన్న, మాణిక్యమ్మ, పోతు నారాయణ, వాసుదేవ్ రెడ్డి, మల్లెల శంకర్ రెడ్డి, బోరెడ్డి కృష్ణా రెడ్డి, జంగిలి సాహెబ్, రాజశేఖర్ రెడ్డి, బాల లింగన్న, చెన్నారెడ్డి, సోముల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు చదువుపైనే దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్తమ ఫలితాలకు సహకరించాలని హెడ్మాస్టర్ ఎం.సోమశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెడ్ మాస్టర్ అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ తెలుగు ఉపాధ్యాయులు వైవిఎస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గర పడుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని పిల్లలకు ఇతర పనులు అప్పగించకుండా కేవలం చదువుపైనే దృష్టి సారించేలా చూడాలన్నారు.

ప్రశ్నించే వారిని ఎమ్మెల్సీలుగా గెలిపిద్దాం

(5వ పేజీ తరువాయి..) అధ్యక్షులు ఏ.రాము కోరారు. సునిపెంటలో జూనియర్ కాలేజీ, తహశీల్దార్ కార్యాలయం లైన్, శ్రీశైలంలో కొత్తపేట కాలనీ, రెడ్ల సత్రం లైన్, యదవ సత్రం లైన్, వడ్డెరకాలనీలలో ఓటర్లను వారు కలిసి ప్రచారం నిర్వహించారు. **పాములపాడు :** ఎస్సీ ఎస్టీ బీసీ, 198 ప్రజా సంఘాలు బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, నాయకులు మధు ఎమ్మెల్సీ ఓటర్లను కోరారు. మండలంలోని జూటూరు, కోల్స్ ఆనందపురం, కంబాలపల్లె, ఇస్కాల గ్రామాలలో ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. **బనగానపల్లె :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీసీ సంఘం జిల్లా నాయకులు పాండురంగ యాదవ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు శివయ్య సిఐటియు డివిజన్ కార్యదర్శి జీవీ సుబ్బయ్యలు కోరారు. మండలంలోని ఎర్రగుడి, హుస్సేనాపురం, యనకండ్ల, బత్తులూరుపాడు గ్రామాలలో ప్రజానాట్యమండలి, సిఐటియు, బిసి సంఘం, యాదవ సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పోతుల నాగరాజును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్, మండల అధ్యక్షులు ఎర్రగుడి గణ మద్దిలేటి యాదవ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, అరసం నాయకులు నాగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ పట్టణంలోని ఇందిరా నగర్ లో, గవర్నమెంట్ హాస్పిటల్, కోర్టులలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని కురుకుంద గ్రామంలో ఏపీ రైతు సంఘం కార్యదర్శి మహబూబ్ బాషా ప్రచారాన్ని నిర్వహించారు. డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు ఏ.రణధీర్, సిఐటియు పట్టణ కార్యదర్శి డి.రామ్ నాయక్, పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఏ.సురేంద్ర, కెవిపిఎస్ నాయకులు భాస్కర్ పాల్గొన్నారు. **వెలుగోడు :** పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వాదం నాగ మోహన్, బీసీ రాష్ట్ర సంఘం నాయకులు రఘు రాముడు, రైతు సంఘం జిల్లా నాయకులు యాదాటి నాగేంద్రుడు మండలంలోని ఇందిరానగర్, గాంధీనగర్, గుంతకందాల గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు ఖాదర్ వలీ, మోదిన్ భాష, రహంతుల్లా, కరిముల్లా, శివ నాయుడు తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ పోతుల నాగరాజును, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు టి.శివరాం, ప్యాపిలి మండల కార్యదర్శి ఎస్.ఏ.చిన్న రహిమాన్, రామాంజినేయులు, నాగమద్దయ్య ఓటర్లను కోరారు. మండలంలోని జలదుర్గం, రామకృష్ణాపురం, మాధవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. చంద్ర, బాలకృష్ణ, అనిల్ కుమార్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సున్నిపెంటలోని ప్రభుత్వ కార్యాలయంలో...

పాములపాడు మండలంలో...

ఆత్మకూరు పట్టణంలో...

వెలుగోడు మండలంలో...

ప్యాపిలి మండలంలో...

పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారి పరిశీలన

ప్రజాశక్తి - రుద్రవరం

ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను, వసతులను ఎన్నికల సెక్టోరియల్ అధికారి గంగాధర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల నిర్వహణ సంబంధించి 2 బూతులను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 39 ఉపాధ్యాయ, 789, పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రం గదులలో ఫ్యాన్లు , లైట్లు , టేబుల్, మరుగుదొడ్లు, తాగునీరు, తదితర వసతుల గురించి అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట డిప్యూటీ తాసిల్దార్ మహబూబ్ బాషా, ఇంచార్జ్ ఆర్ ఐ, రామ్ రంజిత్,హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు వెంకటరమణ, యువకాంతు ,తదితరులు ఉన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ ధోనీ ఆల్ ఫ్రెడ్, ఎంపిడివో సుబ్బరాజులు పరిశీలించారు. తాగు నీరు, కరెంటు సరఫరా, మరుగుదొడ్లు తదితర వసతుల వివరాలను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఎంసిసి అధికారి అన్వర్ హుస్సేన్. తదితరులు పాల్గొన్నారు. **సంజామల :** ఈనెల 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ మల్లికార్జున రావు పరిశీలించారు. రూములు, నీటి సౌకర్యం, బాత్రూములు తదితర వాటిని పరిశీలించారు. అన్ని సౌకర్యాలు పోలింగ్ రోజుకల్లా ఏర్పాటు చేయాలని ఆ పాఠశాల హెచ్ఎంను ఆదేశించారు.

రుద్రవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి గంగాధర్

సంజామలలో పరిశీలిస్తున్న అధికారులు

శాంతిలో నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే

ప్రజాశక్తి - పాణ్యం

శాంతి రామ్ ఫార్మసీ కళాశాలలో నేషనల్ ఫార్మసీ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాంటీ బయోటిక్స్ రెసి స్టాన్స్, నార్కోటిక్స్, సైకో ట్రాఫిక్ డ్రగ్స్ వల్ల కలిగే దీర్ఘ కాలిక హాని మొదలైన అంశాలపై వ్యాస రచన, చర్చా కార్యక్రమం, వక్తృత్వపు పోటీలు, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామని ప్రిన్సిపాల్ మధు సూదన్ శెట్టి తెలిపారు. ఫార్మసీ రంగంలో విద్యార్థులు విశేషంగా రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మునీర్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య విశిష్టత తెలిపే రంగవల్లి

8న సీనియర్ సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ


మాట్లాడుతున్న

స్థానిక ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈ నెల 8న నంద్యాల జిల్లా స్థాయి సీనియర్ సెపక్‌తక్రా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సెపక్‌తక్రా చైర్మన్ నరసింహ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, కార్యదర్శి ఋషికేష్‌లు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18, 19వ తేదీలలో నందికొట్కూరులోని శ్రీ నవనంది ఇంగ్లీషు మీడియం హైస్కూల్ గ్రౌండ్ నందు జరిగే 33వ రాష్ట్రా స్థాయి సీనీయర్ సెపక్‌తక్రా పోటీలలో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 9703241510, 8919950782, 9542171827 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

8న త్రోబాల్ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సబ్ జూనియర్ త్రోబాల్ (బాలురు, బాలికలు) ఎంపిక పోటీలు ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర త్రోబాల్ సెక్రటరీ స్రవంతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఏప్రిల్ 1-2007 సంవత్సరం తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. పాల్గొనే క్రీడాకారులు వారి వెంట ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. త్రోబాల్‌లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుండి 30వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయ్‌లో జరిగే 30వ జాతీయస్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీలలో ఎపి జట్టు తరపున పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు సెల్ 7799515492, 9885859183, 9440826259, 6301571780 నెంబర్లను సంప్రదించాలన్నారు.

స్వీప్ పోగ్రామ్ స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, డిఆర్ఓ తదితరులు

ఓటర్లలో అవగాహన కల్పించాలి

- స్టిక్కర్ గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భాన్ని పురస్కరించుకొని ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఓటు వేసే విధానంపై స్వీప్ కార్యక్రమం ద్వారా సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఛాంబర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేయదగినవి, చేయకూడనవి సూచనలపై ముద్రించిన స్టిక్కర్ గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శాసన మండలి ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు, టీచర్లు ఓటు వేసే విధానంపై స్వీప్ కార్యక్రమం ద్వారా సంపూర్ణ అవగాహన కల్పించాలని సంబంధిత నోడల్ అధికారి లీలావతిని ఆదేశించారు. జిల్లాలోని 94 పోలింగ్ కేంద్రాలు, అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ముద్రించిన స్టిక్కర్ పోస్టర్లను ప్రదర్శించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్లు చేయదగినవి, చేయకూడనవి తదితర అంశాలపై ఓటర్లను ప్రభావితం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, కమాండ్ కంట్రోల్ రూమ్ సూపరింటెండెంట్ నాగమణి, స్వీప్ నోడల్ అధికారి అధికారి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జిఎం ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - పాణ్యం : ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కాలేజీలో ఫిజిక్స్ డిపార్ట్మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న రాళ్లపల్లి రమణమ్మ జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి ఈ నెల 4న డాక్టరేట్ అందుకున్నారు. బ్యాటరీ, సూపెర్కెపాసిటర్ల శక్తి సామర్థ్యం పెంచుటకు సంబంధించి 'రారే ఎర్త్ ఇయోన్స్ దోపుడు బేరియం టితనాతె నానోసెరామిక్స్ బేస్డ్ ప్యారడీక్ హైబ్రిడ్ సూపెర్కెపాసిటర్స్ ఫర్ ఎనర్జీ స్టోరేజ్ అప్లికేషన్స్' మీద చేసిన పరిశోధనకు రాళ్ళపల్లి రమణమ్మకు జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, అనంతపురం వారు భౌతికశాస్త్ర విభాగంలో ప్రధానం చేశారు. రాళ్ళపల్లి రమణమ్మను కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.శాంతిరాముడు, ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్, హెచ్ఒడి రవి, అధ్యాపకులు అభినందించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ప్రజాశక్తి - పాములపాడు : మండలంలోని బానకచెర్ల గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించినట్లు పశువైద్యాధికారి భాస్కర్ తెలిపారు. 100 ఎద్దులు, 120 గేదెలు, 80 దూడలకు ఉచితంగా టీకాలు వేశారు. 4 నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు తప్పని సరిగా వేయించాలని రైతులకు అవగాహన కల్పించారు. వ్యాధి వస్తే పాల ఉత్పత్తి తగ్గడం, పని సామర్థ్యం తగ్గడం, దూడల్లో మరణాలు సంభవిస్తాయని రైతులకు తెలియపరిచారు. సిబ్బంది తిరుపతమ్మ, ప్రసన్న, భాస్కరు, శ్రీకాంత్, ప్రవీణ, రాఘవేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

జాడ లేని స్వీప్ కార్యక్రమం

- ఓటర్లకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు స్వీప్ ప్రోగ్రాంను ఎన్నికల కమిషన్ అమలు చేస్తుంది. కానీ అధికారుల అవగాహన రాహిత్యమో..లేక నిర్లక్ష్యం ఏమో గానీ ఓటర్లకు అవగాహన కల్పించడంలో అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నా నేటికీ ఎక్కడ కూడా స్వీప్ ప్రోగ్రాం జాడ కనపడడం లేదు. ఈ ప్రోగ్రాం ద్వారా ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు వేసుకోవాలని, ఎన్నికల కమిషన్ అండగా ఉంటుందని, ఓటు ప్రజాస్వామ్యానికి ఆయుధం లాంటిదని, ఓటును అమ్ముకుంటే సమాజం అంధకారం అవుతుందని, ఓటు ఆలోచించి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని తదితర అంశాలను క్రోడీకరించి ఎన్నికల కమిషన్ స్వీప్ ప్రోగ్రామ్ అమలుకు ఒక మోడల్ అధికారిని నియమించింది. ఆ అధికారి ద్వారా స్వీప్ ప్రోగ్రాంను నిశ్చితంగా ఓటర్లలోకి ప్రజల్లోకి తీసుకెళ్తారు... కానీ నంద్యాల జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జరుగుతుంది. అధికార పార్టీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నా అధికార యంత్రం పట్టించుకోకపోగా, స్వీప్‌ను అమలు చేయడంలో, జిల్లాలో వాటి జాడే కనపడటం లేదని... కేవలం పోస్టర్లకే పరిమితం అయిందని జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగంపైన విమర్శలు వస్తున్నాయి.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

ప్రభుత్వ పాఠశాలను డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని గోవిందపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సన్నద్ధం కావాలని, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి అధిక మార్కులు సాధించాలని తెలియజేశారు. విద్యార్థులతో కలిసి డిఇఒ మధ్యాహ్నం భోజనం చేసి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను, ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబులను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగలక్ష్మి, సిఆర్‌పి పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యను బోధించాలని జిల్లా ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండంలోని నెహ్రునగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థులు ఇచ్చిన ట్యాబ్ ఏ విధంగా వినియోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వాటిని ఏవిధంగా వినియోగించాలో విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కష్టపడి చదివే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఏఎస్ఓ దస్తగిరి బాబు, ఎంఇఒ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న

చిరు ధాన్యాలతో దీర్ఘ కాలిక వ్యాధులు దూరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయడానికి చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో కృషి విజ్ఞాన కేంద్రం, సత్వ మిల్లెట్స్ అండ్ ఫుడ్ ప్రొడక్ట్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ జి.ధనలక్ష్మి అధ్యక్షతన చిరు ధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడి, పద్మశ్రీ ఖాదర్ వలీలు మాట్లాడారు. చిరు ధాన్యాలు ఆరోగ్యానికి శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి టి మోహన్ రావు, ఎస్‌హెచ్ఇ, సిఇ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ కుమార్, కెవికె శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, ఆదినారాయణ, రవి గౌడ్ విద్యార్థులు, ఐసిడిఎస్ సిబ్బంది, వెలుగు మహిళా సిబ్బంది, సత్వ మిల్లెట్ సిబ్బంది, రైతులు, రైతు మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలన

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సోమవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. నాన్ అమృత కింద 116 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న తాగునీటి ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. సిద్దేపల్లి రాస్తా, దుద్యాల రస్తాలో నిర్మిస్తున్న వైఎస్సార్ నిర్మాణ పనులను పరిశీలించడంతోపాటు ఈ పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ముస్లిం మైనార్టీ షాదీఖానా నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు ఎం ఏ రషీద్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, ప్రకాష్ రావు, హరి, సుల్తాన్, వైసిపి నాయకులు పువ్వాడి భాస్కర్, వరాల మాలిక్, సయ్యద్ మియ్యా తదితరులు పాల్గొన్నారు.

ఓహెచ్ఆర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

వైసిపి ప్రభుత్వం రైతుల పక్షపాతి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కొలిమిగుండ్ల మండలం తోల్లమడుగు, ఉమ్మాయి పల్లె గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో జలకళ పథకం ద్వారా 800 బోర్లు వేశామని, జిల్లాలోనే మొదటి స్థానంలో ఉన్నామని చెప్పారు. తోళ్లమడుగు, ఉమాయిపల్లెలలో 24 బోర్లు వేశామన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైయస్ జగన్మోహన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు, రైతులను కోరారు.

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సన్మానిస్తున్న రైతులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మాట్లాడుతున్న షాహినా బేగం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని ప్యానెల్ న్యాయవాది షాహినా బేగం అన్నారు. సోమవారం పట్టణంలోని ఐడియస్ పాఠశాలలో విద్యార్థినిలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జడ్జి వాసు ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మహిళలకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలకు ప్రత్యేక పాత్ర ఉంటుందని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. విద్యార్థినిలు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి వివరించారు.. **పాణ్యం :** పాణ్యం మహిళా సమాఖ్య భవనంలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమంగా రాణిస్తారని, మహిళా సాధికారితకు ఇదే నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో సరళమ్మ, వివోఏలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : జడ్జి

ఆత్మకూరు : మహిళలు చట్టాలపై అవగాహన మరింత పెంచుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక సత్యసాయి ధ్యాస మందిరంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు.ఈ చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సూర్యకుమారి, విజయ్ కుమారి, నాగేశ్వరమ్మ, దేవమ్మ, మెప్మా అధికారిని హుసేన్ బి, ఆత్మకూరు ఎస్సై కష్ణమూర్తి, న్యాయవాదులు ఆడిగ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు